హై స్పీడ్‌తో హైరానా..!



ఖమ్మం నగరంలో కొంతకాలంగా పనిపాట లేని కొందరు ఆకతాయిలు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. హై స్పీడ్ కలిగిన వాహనాలను విచ్చలవిడిగా నడుపుతూ ప్రాణాలమీదకు తీసుకొస్తున్నారు. ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయాన కట్టింగ్ ఇస్తుండడంతో వారు ఒక్కసారిగా భయాందోళనకు గురై కిందపడి ప్రాణాలు కోల్పోతున్నారు. వారి స్పీడ్‌ను అరికట్టే వారు లేకపోవడంతో వారి ఆగడాలు హెచ్చుమీరుతున్నాయి. కాగా, ఈ డ్రైవింగ్ చేసేవారిలో అధిక శాతం మైనర్లు ఉండడం గమనార్హం. – ఖమ్మంక్రైం

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఆకతాయిలు

- మితిమీరిపోతున్న ఆగడాలతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- వాహనాలకు కటింగ్ ఇస్తున్న సమయాన ప్రమాదాలు
- పలువురు కిందపడి మృత్యువాత పడుతున్న వైనం
- కట్టడిలో పోలీస్ అధికారుల విఫలం

కొన్ని సంఘటనలు..

నగరంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో సుమారు 150 హై స్పీడ్‌తో డ్రైవింగ్ చేస్తూ ముందు వెళ్తున్న వాహనాలకు కటింగ్ ఇస్తూ ఓవర్‌టేక్ చేస్తున్నారు. దీంతో ఇతర వాహనదారులు ఒక్కసారిగా భయపడి వణికిపోయేలా చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని సంఘటలు పరిశీలిస్తే..

- గతేడాది నగరంలోని జెడ్పీ సెంటర్‌లో ఓ ఏఎస్‌ఐ విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా అత్యంత వేగంగా వచ్చిన ఓ ఆకతాయి ఆయన ద్విచక్రవాహనానికి ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.
- కొన్ని నెలల క్రితం అమెరికాలో వ్యాపారం చేస్తూ ఖమ్మంలో ఒక వారం పాటు గడపడానికి వచ్చిన శ్రీనివాస్‌నగర్‌కు చెందిన నజీర్ ఓ రోజు మమతా రోడ్డులో రోడ్డు క్రాస్ చేస్తుండగా.. ఓ మైనర్ హైస్పీడ్‌తో వచ్చి తన ద్విచక్రవాహనంతో వేగంగా ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు.
- కొన్నిరోజుల క్రితం వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్న ఓ వ్యక్తి ప్రకాష్‌నగర్‌లో తన ఇంటికి వెళ్లే క్రమంలో సైకిల్‌పై రోడ్డు క్రాస్ చేస్తుండగా.. అటుగా మితిమీరిన వేగంతో ట్రిపుల్ రైడింగ్ చేస్తూ అతివేగంగా వచ్చి ఆ హమాలీని ఢీకొట్టాడు. దీంతో ఆయన అక్కడిక్కడే మృతిచెందగా.. ముగ్గురు కూతుళ్లు ఉన్న ఆయన కుటుంబం రోడ్డున పడింది. ఇలా అనేక మంది ఆకతాయిల ర్యాష్ డ్రైవింగ్‌కు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

బ్రేక్ వేసేదెవరూ..?

నగరంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారి స్పీడ్‌కు పోలీసులు బ్రేక్ వేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటువంటి వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా మమతారోడ్డు, గొల్లగూడెం రోడ్డులో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు, పాదచారులను కొంతమంది ఆకతాయిలు భయపెడుతుండగా.. మరికొంతమంది ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ మహిళలు, యువతుల వద్దకు వచ్చి ఒక్కసారిగా కటింగ్ కటింగ్ ఇస్తుండడంతో వారు కిందపడి గాయాల పాలవుతున్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారితో పాటు వారికి వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా అరికట్టాలని కోరుతున్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు..



ఖమ్మంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై సీపీ సునీల్ దత్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యాన ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ లేకుండా నడిపే వాహనాలపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నాం. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేయడంతో పాటు ఆ వాహనాన్ని సీజ్ చేస్తున్నాం.

– చంద్రమోహన్, ట్రాఫిక్ సీఐ

క్లుప్తంగా

కేంద్ర మంత్రికి సన్మానం

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర హోం సహాయ మంత్రిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ శనివారం కరీంనగర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో పర్యటన చేయాలని కోరగా.. పార్లమెంట్ సమావేశాలు అయిపోగానే త్వరలో ఖమ్మం వస్తానని చెప్పినట్లు గల్లా తెలిపారు. ఆయన వెంట లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు సుగ్గల వెంకటగుప్తా పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరం



మొక్క నాటుతున్న వైద్య విద్యార్థులు

ఖమ్మంరూరల్: మండలంలోని మంగళగూడెంలో ఎంవెంకటాయపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి ఆధ్వర్యాన శనివారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో ఖమ్మం నగరానికి చెందిన ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు గ్రామంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులకు క్యాంప్‌లో భాగంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటి మొక్కల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుజన, దివ్య, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కూసుమంచి: కూసుమంచిలోని ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు బానోత్ నవ్య బాంబే ఐఐటీలో, ఉమేష్ చంద్ర మిజోరాంలోని ఎన్ఐటీలో సీట్లు సాధించగా శనివారం వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవికుమార్, పాఠశాల హెచ్‌ఎం రాయల వీరస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి సీట్లు సాధించడం గర్వకారణమని, భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరకోవాలని ఆకాంక్షించారు.

పత్తి సాగులో మెళకువలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

కామేపల్లి: రైతులు పత్తి సాగులో మెళకువలు పాటిస్తే పంట దిగుబడి పెంచుకోవచ్చని ఖమ్మం డివిజన్ ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని జాస్తిపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ భూక్యా తారాదేవి, ఏఈఓ జగదీశ్వర్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి



ఐసీడీఎస్ పీడీకి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: గత మూడేళ్లుగా దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదని వెంటనే రుణాలు అందించాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ దివ్యాంగుల అధ్యక్షుడు కుంచం ఉప్పలయ్య ఆధ్వర్యాన ఐసీడీఎస్ పీడీ రామ్‌గోపాల్ రెడ్డికి దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వినతి అందించిన వారిలో దివ్యాంగుల జిల్లా మహిళా అధ్యక్షురాలు జంగిపల్లి ఉప్పలమ్మ, నగర అధ్యక్షురాలు చైతన్య, కోటి, అంబటి శ్రీను, సుకన్య, ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు జంగిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చేగొమ్మ నర్సరీలో 26న వేలం

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ ఉద్యాన నర్సరీలో వెదురు, సరుగుడు చెట్ల విక్రయానికి ఈనెల 26న బహిరంగ వేలాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యాన అధికారి పి.అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలోని 300 వెదురు, 500 సరుగుడు చెట్ల విక్రయానికి ఈ వేలం నిర్వహిస్తుండగా.. ఆసక్తి గల వారు రూ.5వేలు ధరావత్ చెల్లించి పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు 89777 14104 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతు డిక్లరేషన్‌లో భాగమే రుణమాఫీ



పాలాభిషేకం చేస్తున్న శేఖర్‌గౌడ్, తదితరులు

రఘునాథపాలెం: వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేయడానికి పూనుకున్నదని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మొక్కశేఖర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కోటపాడులో రైతులు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. రైతు రుణమాఫీకి రూ.31వేల కోట్లు ప్రకటించిందన్నారు. అనంతరం అరిఫ్ పొలంలో కొబ్బరికాయలు కొట్టి దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొంటేముక్కల నాగేశ్వరరావు, కోటేరు నర్సిరెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చీమల గోపి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శులు సన్నిశ్ల వెంకటేశు, బోడా తావూరియా నాయక్‌తో పాటు బాతుల రమణ, బాతుల సుధాకర్, బండి రమాదేవి, ఎస్.కె అరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాదాన్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న షేక్ బషీరుద్దీన్

తిరుమలాయపాలెం: దేశంలో బీజేపీ మతోన్మాద విధానాలను తిప్పికొట్టేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ బషీరుద్దీన్ అన్నారు. శనివారం తిరుమలాయపాలెంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి త్యాగాలు, పోరాటాలు చేయని బీజేపీ, ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలు నేడు దేశభక్తి గురించి మాట్లాడుతున్నాయని, నిజమైన దేశభక్తులు కమ్యునిస్టులేనన్నారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడగా.. పార్టీ మండల నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు, వేగినాటి వెంకట్రావు, పద్మనాభుల సుధాకర్, కొలిచలం స్వామి, వెంకటేష్, దొండేటి సుగుణమ్మ, దాసరి మహేందర్, యాదగిరి, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరికి గాయాలు

నేలకొండపల్లి: స్థల వివాదం విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కట్టుకాసారాంలో ఓ స్థలం పంచాయితీకి సంబంధించి శనివారం గొడవ జరిగింది. దీంతో ఇరువర్గాల వారు రాళ్లు విసురుకోగా వెంకట్రావమ్మ, ఆయన కుమారుడు సతీష్, మరో వర్గానికి చెందిన బోయపాటి శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ బెటాలియన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ కార్యక్రమాలు శనివారం నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఫైర్ విన్యాసాలు, అగ్ని ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన రక్షణ, సహాయ చర్యలు తదితర అంశాలపై కేడెట్లకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్లు పేలిన ప్పుడు, ఇతర అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పనులపై 11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్ పర్యవేక్షణలో కూసుమంచి ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు ఆధ్వర్యాన సిబ్బంది అవగాహన కల్పించారు.

బొగ్గు గనుల వేలం పాట రద్దు చేయాలి



ర్యాలీ తీస్తున్న సీఐటీయూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావులను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి 10వ విడత వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, వేలం పాటలను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 60 బొగ్గు బ్లాకులను వేలంపాట ద్వారా ప్రైవేట్ శక్తులకు కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకున్నదని, దీనిని వెంటనే విరమించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, విష్ణు వర్ధన్, బండారు యాకయ్య, శ్రీనివాస్, మల్సూరు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణకు ఆందోళనలు

ఖమ్మంమయూరిసెంటర్: సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బొగ్గు వేలం పాటలను అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే సింగరేణి సంస్థ రోజు రోజుకు కుచించుకుపోతున్నదని, ఈ నేపథ్యంలో సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులను వేలం వేస్తే మనుగడే ప్రమాదంలో పడుతుందన్నారు. కేంద్రం ప్రైవేట్ వ్యక్తులకు జాతి సంపదను కట్టబెడుతుదని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి విషయంలో అటు బీజేపీకి మద్దతునిస్తూ ఇటు వేలం పాటలకు పోకుండా అడ్డుకుని భవితవ్యాన్ని దెబ్బతీసిందన్నారు. ఇప్పటికే కోయగూడెం ఉపరితల గనిని అరబిందో కంపెనీకి అప్పగించిందని, సత్తుపల్లి ఓసీని మరో ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన బీజేపీ ఇప్పుడు మరో మూడు బొగ్గు బ్లాకులను వేలం వేస్తే సింగరేణి పరిరక్షణకు మరో ఉద్యమానికి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్: నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో సహకారనగర్ 11 కేవీ ఫీడర్ విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 సెక్షన్ ఏఈ బి.తావుర్యా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సహకారనగర్, వీడీఓస్ కాలనీ, గట్టయ్య సెంటర్, కృషిభవన్ రోడ్డు, నూతన మున్సిపల్ కార్యాలయం రోడ్డు, బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ రోడ్డు, బోడేపూడి స్తూపం ఏరియాల్లో కరెంట్ ఉండదన్నారు. అలాగే ఖమ్మంఅర్బన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని డెయిరీ ఫీడర్, మైసమ్మ ఫీడర్ల పరిధిలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా డెయిరీ ఫీడర్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మైసమ్మ గుడి ఫీడర్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పోలీసు కాలనీ, రాఘవయ్య నగర్, మమతారోడ్డు, రాధాకృష్ణనగర్, వరదయ్యనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

30న బాలు స్మృతి గీతాంజలి

ఖమ్మంగాంధీచౌక్: గాన గంధర్వుడు, పద్మ విభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం 78వ జయంతోత్సవం సందర్భంగా ఈ నెల 30వ తేదీన నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో బాలు స్మృతి గీతాంజలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొగిలి ఎంటర్‌టైన్మెంట్స్ ఆధ్వర్యాన 'నా పాట పంచామృతం' పేరిట ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కొత్తగూడెం, వరంగల్, ఖమ్మం, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన సినీ నేపథ్య గాయకులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు ప్రముఖ కమెడియన్, ఫన్నీ యాంకర్ మొగిలి గుణకర్, ప్రముఖ రచయిత, దర్శకులు కొత్తపల్లి శేషులు చెప్పారు. కళాభిమానులు, కళాకారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్నాటిని కలిసిన మాజీ మంత్రి పువ్వాడ



కృష్ణతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ నాయకుడు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం కృష్ణ నివాసంలో కలిశారు. నాలుగు రోజుల క్రితం కృష్ణను పోలీసులు అరెస్ట్ చేయడంతో పువ్వాడ ఆయన నివాసానికి వెళ్లి ధైర్యం చెప్పారు.బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, అక్రమ కేసులు ఎన్ని పెట్టినా ఎదుర్కొని ధైర్యంగా పోరాడదామని పువ్వాడ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్‌జేసీ క్రిష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ వలరాజు, నాయకులు విజయ్‌కుమార్, బిక్కసాని జశ్వంత్, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి



జక్కేపల్లిలో మాట్లాడుతున్న రవికుమార్

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ సూచించారు. శనివారం కూసుమంచి, జక్కేపల్లి ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. బేస్‌లైన్ టెస్టులు నిర్వహించిన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలని, ఈ మేరకు వారికి బోధన చేయాలన్నారు. ప్రతీ మూడో శనివారం నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విద్యార్థుల ప్రగతిని వివరించాలని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా సకాలంలో హాజరై విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేలా బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ భూలక్ష్మి, హెచ్‌ఎంలు వీరస్వామి, శ్రీనివాసరావు, కస్తూర్బా ఎస్‌ఓ అజితకుమారి పాల్గొన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యాన నగరంలోని మురుగు కాల్వల పూడికతీత పనులను వేగవంతం చేయాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్ పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం కేఎంసీ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ రోజు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డివిజన్లను సందర్శించి డ్రెయిన్లలో మురుగు పేరుకుపోకుండా, ఖాళీ స్థలాలు, కొబ్బరిబోండాలు, రోడ్ల వెంట నీళ్లు ఆగకుండా చూడాలన్నారు. నిత్యం కార్మికుల హాజరు తీసుకోని పక్షాన జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులను ఖండించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల పక్షాన పోరాడుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. శనివారం ఖమ్మంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యాన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్, పీవైఎల్ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్‌లు మాట్లాడుతూ.. నీట్ పరీక్షను రద్దు చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ శాంతియుతంగా హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.అంతేకాక నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇంటి ముందు నిరసన వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీచార్జ్ అమానుషం అన్నారు. నీట్ విద్యార్థుల తరపున గొంతువిప్పుతున్న నేతల అక్రమ అరెస్టులను ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు లక్ష్మణ్, రవీందర్, శ్రీకాంత్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

బాలల సదనం సందర్శన

ఖమ్మం లీగల్: ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ చంద్రశేఖర్‌రావు శనివారం సాయంత్రం బాలల సదనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాలలతో మాట్లాడి.. భారత రాజ్యాంగం, న్యాయ సేవ సంస్థల చట్టాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సదనం సూపరింటెండెంట్ వరలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.50 వేల ఆర్థిక సాయం



సమావేశంలో మాట్లాడుతున్న దండా ప్రవీణ్

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రాజేశ్వరపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు దండా ప్రవీణ్ శనివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే ఇటీవల మృతి చెందిన ఆటో డ్రైవర్ అశోక్ కుటుంబానికి సైతం ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాజేశ్వరపురం సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ వడ్లమూడి ఏసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి వివాహానికి..

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కమాన్‌బజార్‌లో టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఓ కుటుంబానికి చెందిన దివ్యాంగురాలు రాశి వివాహ ఖర్చులకు శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం రూ. 10 వేల ఆర్థిక సాయం చేసింది. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు టి.క్రిష్టారెడ్డి, కార్యదర్శి వి.హనుమంతరావు, జోన్ చైర్మన్ డీపీసీ రావు, పాయల నాగేశ్వరరావు, కమర్తపు కిరణ్, దుర్గా నాగేశ్వరరావు, అత్తలూరి గోవర్ధన్, అబ్దుల్ అలీం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల గురుకుల డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇ.రామకృష్ణ తెలిపారు. శనివారం ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు మస్తాన్, ప్రవీణ్‌లతో కలిసి రామకృష్ణ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న సందర్భంగా మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇరవై రోజులు అవుతున్నా.. ఇంతవరకు క్లాసులు ప్రారంభం కాలేదని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని అడిగినందుకు విద్యార్థి సంఘాల నాయకులపై కళాశాల సిబ్బంది వాగ్వాదానికి దిగారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గురుకులాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, మనోజ్, భాను, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం రూరల్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లో పర్యటించనున్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని కైకొండాయిగూడెం, టీఎన్జీఓస్ కాలనీ, సాయిగణేష్‌నగర్, సాయిప్రభాత్‌నగర్, నాయుడుపేట, ఆరెంపులలో పర్యటించనుండగా, నాయుడుపేటలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు. అలాగే, కూసుమంచి మండలం ముత్యాలగూడెం తదితర గ్రామాల్లోనూ మంత్రి పర్యటిస్తారని క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

అనుమానాస్పదంగా కారు చక్కర్లు

నేలకొండపల్లి: ఓ కారు అర్ధరాత్రి వేళ అనుమానస్పదంగా తిరుగుతుండడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేలకొండపల్లి మండలం మోటాపురంలో గత మూడు రోజులుగా అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చివెళ్తున్నారు. స్థానికులు ఆపినా ఆగకపోవడంతో అనుమానంతో శుక్రవారం రాత్రి యువకులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా తీగలు..!



మండలంలోని మంగాపురంతండాలో ఓ రైతు పొలంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. గ్రామానికి చెందిన భూక్యా చందర్‌రావు అనే రైతు పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఇదిగో ఇలా చేతికి అందేలా ఉన్నాయి. దీంతో అటుగా పొలానికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. విద్యుత్ తీగలు సరిచేయాలని మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని రైతు వాపోతున్నాడు. ఇప్పటికైనా ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరి చేయాలని కోరుతున్నారు. - నేలకొండపల్లి